సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
శనివారం | 28 | సెప్టెంబర్ | 2024



టీజీ ఎన్పీడీసీఎల్‌లో బదిలీలు

టీజీ ఎన్పీడీసీఎల్‌లో అధికారులు, ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు సీఎండీ వరుణ్‌రెడ్డి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. - 10లో▸



కక్కుర్తి పడ్డారు.. అడ్డంగా దొరికారు - 10లో▸

జనగామ జిల్లా ఆర్‌అండ్‌ బీ ఈఈ హుస్సేన్, ఏటీఓ రవీందర్‌లు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.

గరిష్టం/కనిష్టం
33.0^0 / 23.0^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఎడపల్లిలో జియోలాజికల్ సర్వే



కాళేశ్వరం: మినిస్ట్రీ ఆఫ్ మైన్స్ ఆధ్వర్యంలో మహదేవపూర్ మండలం ఎడపల్లిలో నెల రోజులుగా జియోలాజికల్ సర్వే చేస్తున్నారు. భూమి పొరల్లో మార్పులు, నీటి లభ్యత ఎంత మేర ఉందనేది కనుగొననున్నారు. మట్టి పరీక్షలు చేస్తున్నారు. సుమారు 5వేల ఫీట్ల లోతు వరకు డ్రిల్లింగ్ చేసి పరీక్షలకు పంపనున్నారు. బొమ్మాపూర్, ములుగు జిల్లా పస్రాలోనూ పరీక్షలు చేయనున్నారు. పదేళ్లకొకసారి పరీక్షలు చేస్తామని ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. కొన్ని ఫీట్ల వద్ద బొగ్గు కూడా బయటపడినట్లు వారు పేర్కొంటున్నారు.

జాతీయస్థాయికి ఎంపిక



చిట్యాల: నైన్‌పాక ఉన్నత పాఠశాలకు చెందిన తొట్ల భానుప్రసాద్ జాతీయ స్థాయి ప్రేరణ డ్రాయింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఊర్మిళ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి ప్రేరణ డ్రాయింగ్ కాంపిటీషన్‌లో భానుప్రసాద్ మొదటిస్థానంలో నిలిచాడన్నారు. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 5వరకు గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయిలో కాంపిటీషన్‌లో పాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్భంగా భానుప్రసాద్‌ను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, ప్రణీత, విజయశాంతి, పల్లవి, సుజాత, రమేష్, సుభాషిణి, ప్రసాద్, ఓదేలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



కాటారం: మాజీ సర్పంచ్ తెప్పెల దేవేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు తెప్పెల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో గంగారం ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం స్కూల్ బ్యాగ్స్, షూస్, వాటర్ బాటిల్స్, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు గ్యాస్ స్టవ్‌లు డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు చేతుల మీదుగా అందించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందజేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సహకారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు నీలారపు సమ్మయ్య, రాజు, రాకేశ్, ఉడుత తిరుపతి, అందె సత్యనారాయణ, బండారి శ్రీధర్, కాల్వ రాజయ్య, ఆకుదారి ప్రభాకర్, తిరుపతి, గద్దల రమేశ్, పూసాల శశికాంత్ పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

కాళేశ్వరం: భూవివాదంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మహదేవపూర్ మండలం బొమ్మాపూర్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..బొమ్మాపూర్ గ్రామానికి చెందిన పుప్పిరెడ్డి తిరుపతిరెడ్డికి కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన సోమనపల్లి ప్రభాకర్‌రెడ్డితో భూవివాదం ఉంది. తిరుపతి రెడ్డి తన కున్న భూమిలో మిర్చి పంట వేశాడు. ఆ పంటను ప్రభాకర్‌రెడ్డి పీకి వేశాడని అనుమానంతో అతనితో గొడవపడ్డాడు. ఆ విషయం మనసులో పెట్టుకొని తీవ్ర మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం భూపాలపల్లి 100 పడకల ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. తిరుపతిరెడ్డి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బుడా వచ్చేస్తోంది!

భూపాలపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు సన్నాహాలు



భూపాలపల్లి పట్టణం వ్యూ

- జిల్లాకేంద్రంలో త్వరలో ఏర్పడనున్న పట్టణాభివృద్ధి సంస్థ
- చుట్టూ 15 కిలోమీటర్ల పరిధిని కలుపుకొని ఏర్పాటు
- మరింత అభివృద్ధి చెందనున్న కోల్‌బెల్ట్ ప్రాంతం
- మ్యాప్ రూపకల్పన పనిలో మున్సిపాలిటీ అధికారులు

భూపాలపల్లి: పట్టణాలతో పాటు పరిసర ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాకేంద్రాల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. బొగ్గు, విద్యుత్ ఉత్పత్తి పరిశ్రమలతో దినదినం అభివృద్ధి చెందుతున్న భూపాలపల్లిని భూపాలపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బుడా)గా ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా ఈ ప్రాంతం రానున్న రోజుల్లో అభివృద్ధిలో పరుగులు తీయనుంది.

15 కి.మీల పరిధితో మ్యాప్..

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలంటే కనీసం పట్టణానికి నాలుగు వైపుల గల 15 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలు, ప్రాంతాలను కలిపి ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ సూచనలు, కలెక్టర్ ఆదేశాల మేరకు భూపాలపల్లి మున్సిపాలిటీ అధికారులు మ్యాప్‌ను రూపొందిస్తున్నారు. వారం రోజుల్లో మ్యాప్ తయారీ, జనాభా, నివాస, వ్యాపార సముదాయాల సంఖ్య, రహదారులు తదితర వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తారు. అనంతరం ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి అందరి అభీష్టం మేరకు అథారిటీని ఏర్పాటు చేస్తుంది.

నామినేటెడ్ కమిటీ, ప్రత్యేక నిధులు..

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి నామినేటెడ్ కమిటీ, ప్రత్యేక నిధులు ఉంటాయి. చైర్మన్, సభ్యులను ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. వైస్‌చైర్మన్‌గా కలెక్టర్ లేదా ఐఏఎస్ స్థాయి అధికారిని నియమిస్తుంది. ఈ అథారిటీ తమ పరిధిలో భవిష్యత్ 25ఏళ్ల వరకు కావాల్సిన మౌలిక సౌకర్యాలు, అభివృద్ధికి రూపకల్పన చేసి మాస్టర్ ప్లాన్‌ను తయారు చేస్తుంది. ఈ ప్లాన్‌కు సరిపడా నిధులను రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్రం కూడా అందిస్తుంది.

సుందరీకరణపై ప్రత్యేక నజర్..

'బుడా' ఏర్పడితే కనీస సౌకర్యాలతో పాటు సుందరీకరణ పెరుగుతుంది. జంక్షన్ల అభివృద్ధి, గార్డెన్స్ ఏర్పాటు, బ్యూటిఫికేషన్, రోడ్ల నిర్మాణం, విస్తరణ, రిక్రియేషన్ పనులు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపడుతుంది. భౌగోళిక పరిస్థితుల ఆధారంగా రోప్ వే, ట్రెక్కింగ్ లాంటి టూరిజం పనులను అభివృద్ధి చేస్తుంది. మొత్తంగా బుడా పరిధిలోని ప్రజలకు బెటర్ లైఫ్ స్టైల్ అందించేందుకు ప్రయత్నిస్తుంది.

ప్రభుత్వ వెంచర్ల ఏర్పాటు..

ప్రైవేట్ వ్యక్తులు, రియల్ వ్యాపారుల నుంచి నాన్ లే అవుట్ భూములను కొనుగోలు చేసి మోసపోకుండా ఉండేందుకు బుడా లే అవుట్‌లు చేస్తుంది. స్వయంగా భూమిని కొనుగోలు చేసి, లేదా ప్రభుత్వ భూమిని తీసుకొని లే అవుట్ చేసి, అన్ని రకాల వసతులు కల్పించి, అతి తక్కువ ధరలకు ప్లాట్లను అందిస్తుంది. తద్వారా బుడా పరిధిలోని వ్యవసాయ, నివాస భూములు, గృహాల విలువలు సైతం విపరీతంగా పెరుగుతాయి. అంతేకాక గృహ నిర్మాణ అనుమతులు సైతం సులభంగా లభిస్తాయి. మున్సిపాలిటీ పరిధిలో జీ ప్లస్ 2 వరకే అనుమతి ఇస్తారు. అంతకంటే ఎక్కువ నిర్మాణం చేపట్టాల్సి వస్తే వరంగల్‌లోని కుడాకు వెళ్లాలి. కానీ బుడా ఏర్పడితే ఇక్కడే జీ ప్లస్ 5 వరకు అనుమతులు పొందవచ్చు.

ఈ గ్రామాలు కలిసే అవకాశం..

భూపాలపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసి, జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాను ఆధారంగా చేసుకొని నాలుగు వైపులా 15 కిలోమీటర్ల పరిధిని తీసుకుంటే భూపాలపల్లి, మల్హర్, గణపురం మండలాల్లోని పలు గ్రామాలు 'బుడా' పరిధిలోకి రానున్నాయి. కాటారం మండలం బస్వాపూర్, భూపాలపల్లి మండలం రాంపూర్, గొర్లవీడు, పెద్దాపూర్, కొత్తపల్లి(ఎస్‌ఎం), మల్హర్ మండలంలోని ఆన్‌సాన్‌పల్లి, గణపురం మండలంలోని చెల్పూరు, గణపురం, గాంధీనగర్ క్రాస్‌రోడ్ వరకు అథారిటీ పరిధిలోకి రానున్నట్లు తెలుస్తోంది.

మ్యాప్ రూపొందిస్తున్నాం..

రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల మేరకు అర్బన్ అథారిటీ నిబంధనల ప్రకారం భూపాలపల్లి పట్టణం చుట్టూ ఉన్న 15 కిలోమీటర్ల మేర మ్యాప్‌ను రూపొందిస్తున్నాం. మ్యాప్ తయారు కాగానే ప్రభుత్వానికి పంపిస్తాం. ఆ తరువాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు చేపడుతాం.

- రాజేశ్వర్, భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్

కారోబార్ల కష్టాలు

చాలీచాలని వేతనాలు.. ఉద్యోగ భద్రత కరువు

- కుటుంబాలను పోషించుకోలేని దుస్థితి
- పట్టించుకోని ప్రభుత్వాలు



మొట్లపల్లి గ్రామ పంచాయతీ భవనం

మొగుళ్లపల్లి: గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పనిచేస్తున్న కారోబార్ల జీవితాలు దుర్భరంగా మారాయి. నాలుగు దశాబ్దాలుగా చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగ భద్రత కరువై వెట్టిచాకిరి చేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించి తమను పర్మనెంట్ చేయడంతో పాటు కనీస వేతనం ఇవ్వాలని కోరుతున్నారు.

జిల్లాలో 163 మంది..

జిల్లాలో 241 గ్రామ పంచాయతీలు ఉండగా.. 163 మంది కారోబార్లు పనిచేస్తున్నారు. వీరికి నెలకు కేవలం రూ.9,500 వేతనం ఇస్తున్నారు. క్యాష్‌బుక్, రాయడం, ఇంటిపన్నులు, నల్లాపన్నులు వసూలు చేయడం, ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, రికార్డులు రాయడం, పంచాయతీ సమావేశాల మినిట్స్ రాయడం, అజెండా తయారు చేయడం, సభ్యులకు చేరవేయడం లైసెన్స్ ఫీజులు తదితర అన్నిరకాల పనులు కారోబార్లే నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పనులు కూడా చేస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీల్లో కార్యనిర్వాహక అధికారి నిర్వహించే పనులు కారోబార్లే నిర్వహిస్తున్నారు. ప్రతీ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యక్షంగా పాల్గొని పథకాలు అమలు చేయడంలో, ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

అమలుకు నోచుకోని కోర్టు తీర్పు..

గ్రామ పంచాయతీల్లో పనిచేసే కారోబార్లను మల్టీపర్పస్ వర్కర్లుగా మారుస్తూ టీఆర్‌ఎస్ ప్రభుత్వం 2019 సెప్టెంబర్‌లో జీఓ తీసుకొచ్చింది. పంచాయతీ రాజ్ చట్టం (జీజీ నంబర్ 557) ప్రకారం జనవరి 13, 1982 కంటే ముందు పదో తరగతి ఉత్తీర్ణులైన కారోబార్లను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా ఉపాధి కల్పనా అధికారి సూచన మేరకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి కనీస వేతనం ఇవ్వాలనుకుంది. కానీ నేటికీ ఆ నిర్ణయాలు అమలు కావడం లేదు. కారోబార్లకు అనుకూలంగా ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చినా గత ప్రభుత్వాలు పట్టించుకున్న పాపానపోలేదు. 2002లో పదేళ్ల సర్వీసు కలిగిన కారోబార్లందరికీ ఉద్యోగ ఉన్నతి కల్పించాలని ట్రిబ్యునల్ ఆదేశించింది. కానీ ఆ తీర్పు సైతం అమలుకు నోచుకోలేదు. దీంతో వారు 2007లో తిరిగి హైకోర్టును ఆశ్రయించగా రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. అది కూడా బుట్టదాఖలైంది.

కష్టంగా కుటుంబపోషణ..



గ్రామాల అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్నాం. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం కష్టతరంగా మారింది. పనిభారంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి మా సమస్యలు పరిష్కరించాలి.

- బైరగోని కుమారస్వామి, ఆకినపల్లి కారోబార్, కారోబార్ల సంఘం మండల అధ్యక్షుడు

పర్మనెంట్ చేయాలి..



చాలా సంవత్సరాలుగా మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీలో కారోబార్‌గా పనిచేస్తున్న. కనీస వేతనం రాక పూటగడవని పరిస్థితి ఉంది. దీనిని చూసుకొని మరో పనిచేయలేనిప పరిస్థితి ఉంది. దీంతో కుటుంబపోషణ భారంగా మారుతోంది. ప్రభుత్వం తమను పర్మనెంట్ చేసి కనీస వేతనాలు అమలు చేయాలి.

- ఎస్‌కే అబ్దుల్ ముతిలిబ్, మొగుళ్లపల్లి కారోబార్, కారోబార్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు



చెత్త ఏరుతున్న నారాయణబాబు

భూపాలపల్లి రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. అప్పుడే ఆరోగ్యాలు బాగుంటాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణబాబు అన్నారు. జిల్లాకోర్టు ప్రాంగణంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో శుక్రవారం జడ్జి పాల్గొని కోర్టు సిబ్బంది, న్యాయవాదులతో కలిసి పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.జయరాంరెడ్డి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.రామచంద్రారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏదులాపురం శ్రీనివాస్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగులకు ఉపకరణాలు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: అర్హత కలిగిన దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు అందిస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు.. దివ్యాంగులు వయో వృద్ధుల సంక్షేమ శాఖ, అలీంకో కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాకేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో సంయుక్తంగా నిర్వహించిన దివ్యాంగుల సహాయ ఉపకరణాల ఎంపిక కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని దివ్యాంగుల రిజిస్ట్రేషన్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వయో వృద్ధుల వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో పెట్టిన నిబంధనల ప్రకారం కొంత మేర మాత్రమే దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లు, స్కూటీలు ఇచ్చినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లు, స్కూటీలు తదితర ఉపకరణాలు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. రాబోయే రోజుల్లో 1.40 లక్షల ఉద్యోగ నోటిఫికేషన్లలో దివ్యాంగులకు ప్రత్యేక కోటా ఉంటుందని చెప్పారు. కష్టపడి చదివి దివ్యాంగులు ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని తద్వారా తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని సూచించారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. అర్హులైన దివ్యాంగులు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ పొందిన తరవాత రెండు నెలల్లో మరో క్యాంపు నిర్వహించి సహాయ ఉపకరణాలు, బ్యాటరీ సైకిళ్లు, స్కూటీలు అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సంక్షేమ అధికారి చిన్నయ్య, సీడీపీఓ అవంతి, కౌన్సిలర్ శిరుప అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు తెలిసేలా కళా ప్రదర్శనలు

భూపాలపల్లి: ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ఆలోచనలు క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలిసేలా విస్తృతంగా కళా ప్రదర్శనలు చేపట్టాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కళాప్రదర్శనల నిర్వహణపై సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను కళాకారులు ఆట, పాటల ద్వారా తెలియజేయాలన్నారు. కళాకారులకు సంబంధించి ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా పౌరసంబంధాల అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రాధాన్యత రంగాలకు రుణాలు

కలెక్టర్ రాహుల్ శర్మ



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్: ప్రాధాన్యత రంగాలకు రుణాలు మంజూరుచేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ బ్యాంకర్లకు సూచించారు. రుణాలు మంజూరు, రుణాలు రెన్యూవల్స్ తదితర అంశాలపై శుక్రవారం బ్యాంకర్లతో ఐడీఓసీ కార్యాలయపు సమావేశపు హాలులో జిల్లాస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రుణమాఫీ జరిగిన రైతులకు తిరిగి రుణాలు అందేలా చొరవ తీసుకోవాలన్నారు. రుణ లక్ష్యసాధనలో మరింత ప్రగతి సాధించేందుకు బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. రైతు వేదికల్లో ప్రతీ నెల సమావేశాలు నిర్వహించి రుణ ప్రగతి పెంచేందుకు మండల స్థాయి అధికారులు కృషి చేయాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఈ ఆర్థిక సంవత్సరం రూ.250 కోట్ల రుణాలు మంజూరు లక్ష్యం కాగా.. ఇప్పటి 1480 సంఘాలకు రూ.131 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్బీఐ ఎల్డీఓ అలీబాబా, నాబార్డ్ ఏజీఎం రవి, ఎల్డీఎం తిరుపతి, బ్యాంక్ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాపూజీ ఆశయాలను కొనసాగించాలి

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకలకు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే పాల్గొని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుచేయాలని 1969లో మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేసిన నిబద్ధత కలిగిన రాజకీయ వేత్త అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీని ఆదర్శంగా తీసుకొని పేదల సమస్యలను పరిష్కరించేందుకు సేవకుడిగా పనిచేస్తానని చెప్పారు. మహనీయుడి విగ్రహాన్ని జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసే విధంగా కృషిచేస్తానని తెలిపారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆదర్శప్రాయుడని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవ పోరాటంలో ఆయన పాత్ర చాలా కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి శైలజ, డీపీఆర్‌ఓ శ్రీనివాస్, అన్నిశాఖల జిల్లా అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.


దేశం కోసం పని చేయడం గర్వకారణం

భూపాలపల్లి: దేశం కోసం పని చేయడం ఎంతో గర్వకారణమని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఐడీఓసీ కార్యాలయపు సమావేశపు హాల్‌లో శుక్రవారం ఉపాధి మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్నిపథ్ స్కీం ద్వారా అగ్ని వీర్ వాయు కార్యక్రమం గురించి విద్యార్థులకు, యువతీ యువకులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, ఉపాధి కల్పన అధికారి శ్యామల, అగ్నిపథ్ శిక్షకులు సందీప్, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి..

అటవీ, రెవెన్యూ భూముల మధ్య నెలకొన్న భూ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. అటవీ, రెవెన్యూ భూ సమస్యలపై రెవెన్యూ, అటవీశాఖ అధికారులతో ఐడీఓసీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కాటారం మండలం పోచంపల్లిలోని సర్వే నంబర్ 1లో 660 ఎకరాల భూ సమస్య ఉందని, పరిష్కరించడానికి కాటారం సబ్ కలెక్టర్, అటవీశాఖ అధికారులు సంయుక్త పరిశీలన చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎఫ్ఓ వసంత, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీఓ మంగీలాల్, తహసీల్దార్లు, ఎఫ్ఆర్ఓలు పాల్గొన్నారు.


సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ సంపత్‌రావు

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలో ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని డీఎస్పీ సంపత్‌రావు పిలుపునిచ్చారు. మంజూర్‌నగర్ శ్యామల గ్రాండ్‌లో పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం 'మేము సైతం సీసీ కెమెరాలు' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు కోసం భూపాలపల్లి వర్తక వాణిజ్య సంఘాలు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్‌తో పాటు ఎస్సైలు సుధాకర్, రమేష్, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

భూపాలపల్లి రూరల్: లాభాల వాటాపై ఇతర సంఘాలు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. భూపాలపల్లి ఏరియాలో కేటీకే 6 ఇంక్‌లైన్ ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ శ్రీనివాస్, ఏరియా హాస్పిటల్ ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం వేర్వేరుగా జరిగిన గేట్ మీటింగ్‌లో రాజ్‌కుమార్ మాట్లాడారు. లాభాల వాటాపై నిజనిజాలను కార్మికులకు వివరించాలన్నారు. కొంతమంది ఏఐటీయూసీని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఉనికి కోసమే తప్పుడు ప్రచారం చేస్తూ కార్మికులను తప్పుదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అలాంటి సంఘాలను సింగరేణిలో నామరూపాలు లేకుండా చేయాలని కార్మిక లోకాన్ని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో బ్రాంచ్ సెక్రటరీ మోటపలుకుల రమేష్, ఏఐటీయూసీ నాయకులు మాతంగి రామ్‌చందర్, గురిజేపల్లి సుధాకర్‌రెడ్డి, నూకల చంద్రమౌళి, సత్యనారాయణ, లక్ష్మణమూర్తి, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ హకీమ్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు, గోవర్ధన్, గణేష్, సత్యనారాయణ, రాంబాబు, బ్రహ్మాచారి, తాళ్లపల్లి పోషం, శివ పార్వతి, రవి, సతీష్ హాస్పిటల్ ఇన్‌చార్జ్ పర్వేజ్‌ఖాన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ అర్బన్ : జిల్లాలో 2023–2024 విద్యాసంవత్సరానికి ప్రతిభావంతులైన ఆర్య వైశ్య విద్యార్థులకు పురస్కారాలు అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆవోపా అధ్యక్షుడు వల్లాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఇమ్మడి పుల్లయ్య, విద్యా కమిటీ చైర్మన్ దేసు నరసింహం శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పదో తరగతి నుంచి పీజీ వరకు 61 కోర్సులకు చెందిన ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆర్య వైశ్య విద్యార్థులు ఈనెల 30 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు హనుమకొండ సుబేదారిలోని ఆవోపా కార్యాలయంలో దరఖాస్తు పత్రాలు తీసుకుని పూర్తి చేసి సమర్పించాలని కోరారు. 61 కోర్సుల్లో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తుతోపాటు విద్యార్థి ఫొటో, ఆధార్ కార్డు, మార్కుల మెమో జిరాక్స్ కాపీలు జత చేయాలని, సందేహాల నివృత్తికి 94406 36447, 99498 75510 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పేకాట శిబిరంపై దాడులు

హసన్‌పర్తి: 65వ డివిజన్ ఎల్లాపురంలోని ఓ పేకాట శిబిరంపై శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించి ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. ఎల్లాపురంలోని ఓ రహస్యప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈసందర్భంగా పేకాట ఆడుతున్న వెలిశోజు శ్రీరాం, బాషబోయిన రాజకుమార్, కుసుమ సురేశ్, వెల్దు నాగరాజు, రాపోలు శ్రీనివాస్, కుమారస్వామి, ఎర్ర రాజులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.5,510 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.





టీజీ ఎన్పీడీసీఎల్‌లో బదిలీలు

షెడ్యూల్ విడుదల చేసిన యాజమాన్యం
- నేడు అర్హుల జాబితా ప్రదర్శన
- ఈ నెల 30న అభ్యంతరాలు స్వీకరణ
- అక్టోబర్ 4న దరఖాస్తులకు అవకాశం



హన్మకొండ: తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ మండలిలో అధికారులు, ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. జేఏవో వరకు పదోన్నతి కల్పించిన టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం బదిలీలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు కంపెనీ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. ఈ ఉత్తర్వుల్లో కొన్ని అంశాల్లో స్పష్టత కొరవడినట్లు కనిపిస్తోంది. గతంలో సీనియారిటీ ఆధారంగా నేరుగా బదిలీలు చేయగా.. ఈసారి ఆన్‌లైన్ పద్ధతిలో బదిలీల ప్రక్రియ చేపట్టనున్నారు. అదే విధంగా ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, ప్రొవిన్షియల్ ఉద్యోగులకు పాత పద్ధతిలో బదిలీలు నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు నగరం, పట్టణ, జిల్లా, మండల కేంద్రాల్లో పని చేస్తున్న వారిని గ్రామీణ ప్రాంతాలకు.. గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న వారిని నగరం, పట్టణం, జిల్లా, మండల కేంద్రాలకు బదిలీ చేయనున్నారు. 2025 సెప్టెంబర్ 30 వరకు మాత్రమే సర్వీస్ ఉన్నవారికి బదిలీ నుంచి ఉపశమనం కల్పించారు. వారు కావాలని కోరుకుంటే బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. స్పౌజ్, వితంతువులు, 70 శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులు, కుటుంబ సభ్యులు అనారోగ్యంగా ఉన్నవారికి బదిలీల్లో కోరుకున్న ప్రాంతానికి వెళ్లేలా ప్రాధాన్యత కల్పించారు. వీరు కావాల్సిన పత్రాలు దరఖాస్తుతో జతచేయాల్సి ఉంటుంది.

ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగంలో పని చేస్తున్న జూనియర్ లైన్‌మెన్ నుంచి లైన్ ఇన్‌స్పెక్టర్ వరకు డివిజన్ స్థాయిలో డివిజనల్ ఇంజనీర్ బదిలీలు చేస్తారు. సబ్ ఇంజనీర్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగంలో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ ఫోర్‌మెన్, ఇతర సిబ్బంది సర్కిల్ స్థాయిలో సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) బదిలీలు నిర్వహిస్తారు. వీరిని ప్రస్తుతం పని

రెండు పద్ధతుల్లో ట్రాన్స్‌ఫర్లు

2024 జూన్ 30 వరకు ఒకే పోస్టులో రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు బదిలీలకు అర్హులుగా పేర్కొన్నారు. ఇందులో 50 శాతానికి మించకుండా బదిలీలు చేయనున్నారు. ఈ నెల 28న(నేడు) బదిలీలకు అర్హులైనవారి జాబితాను వెబ్ ఆప్షన్ వారికి వెబ్ సైట్‌లో, పాత పద్ధతిలో బదిలీలు నిర్వహించేవారికి సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు. ఈ నెల 30న అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 4 తేదీన వెబ్ ప్రక్రియ ద్వారా బదిలీలు జరిగే వారు వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి, పాత పద్ధతి వారికి నేరుగా బదిలీ చేస్తారు. అక్టోబర్ 7న బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తారు. 9న ప్రస్తుత పని చేస్తున్న స్థానం నుంచి రిలీవ్ కావాలి. 8 నుంచి బదిలీలపై బ్యాన్ అమలులోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. క్రమశిక్షణ చర్యలు, విజిలెన్స్ విచారణ వారికి బ్యాన్ వర్తించదని తెలిపారు.

చేస్తున్న ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి బదిలీ చేస్తారు. కార్పొరేట్ ఆఫీస్‌లో పని చేస్తున్న సబ్ ఇంజనీర్ నుంచి జూనియర్ పర్సనల్ ఆఫీసర్ వరకు ఉద్యోగులను అదే ఆఫీస్‌లో ఒక విభాగం నుంచి మరో విభాగానికి బదిలీ చేస్తారు. ఏఈ, ఏఏఈ, ఏడీఈలు బదిలీలు సర్కిల్ స్థాయిలో ఎస్ఈలు చేస్తారు. సివిల్ ఏఈ, ఏఏఈ, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌ను హెచ్ఆర్‌డీ సీజీఎం బదిలీ చేస్తారు. కార్పొరేట్ ఆఫీస్‌లో పని చేస్తున్న ఏఈ, ఏడీఈలను కార్పొరేట్ ఆఫీస్‌లో ఇతర విభాగాలకు కాని, ప్రస్తుతం పని చేస్తున్న హెడ్‌క్వార్టర్ అవతలికి బదిలీ చేస్తారు. అకౌంట్స్ ఆఫీసర్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లను సర్కిల్‌ల మధ్య బదిలీ చేస్తారు. పీ అండ్ జీ విభాగంలో పని చేసే ఉద్యోగులను కార్పొరేట్ ఆఫీసర్‌లో వివిధ సెక్షన్ల మధ్య బదిలీ చేస్తారు.

అభ్యంతరాలు సరే.. పరిశీలన ఎప్పుడు?

ఈ నెల 30న బదిలీ అర్హుల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నా.. అభ్యంతరాలు ఎప్పటిలోగా పరిశీలిస్తారు..? అర్హుల తుది జాబితా ఎప్పుడు ప్రదర్శిస్తారనేది పేర్కొనకపోవడం గమనార్హం. కాని బదిలీలకు అక్టోబర్ 4న మాత్రమే దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సూచించారు. ఒక్క రోజులోనే వెబ్‌సైట్‌లో దరఖాస్తుల స్వీకరణ సాధ్యమేనా.. అని అధికార వర్గాలు సందేహం వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రొటెక్షన్ కింద ఎంప్లాయిస్ యూనియన్లు, ఇంజనీర్స్ అసోసియేషన్లు, వెల్ఫేర్ అసోసియేషన్లన్నీ కలిపి 17 సంఘాలకు అనుమతిచ్చారు. మరో ప్రధాన ట్రేడ్ యూనియన్ భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) అనుబంధ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్‌ను యాజమాన్యం విస్మరించింది. అయితే ప్రొటెక్షన్ కింద కంపెనీ స్థాయిలో యూనియన్, అసోసియేషన్ నుంచి అధ్యక్షుడు, లేదా కార్యదర్శుల్లో ఒక్కరికి మాత్రమే అవకాశం ఇచ్చారు. సర్కిల్ స్థాయిలోనూ యూనియన్, అసోసియేషన్ల నుంచి అధ్యక్ష, కార్యదర్శుల్లో ఒక్కరికి మాత్రమే అవకాశం కల్పించారు. యూనియన్, అసోసియేషన్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న అధ్యక్ష, కార్యదర్శులు ఉద్యోగులు, యాజమాన్యానికి అనుసంధానంగా వ్యవహరించేందుకు అందుబాటులో ఉండేలా వారు కోరుకున్న స్థానంలో పోస్టింగ్ పొందే అవకాశం ఉంది.

కక్కుర్తి పడ్డారు.. అడ్డంగా దొరికారు

- ఏసీబీకి చిక్కిన జనగామ ఆర్అండ్‌బీ ఈఈ, ఏఈఈ
- రిటైర్డ్ జవాన్ వద్ద రూ.14వేలు డిమాండ్

జనగామ: జనగామ జిల్లా ఆర్అండ్‌బీ ఈఈ చిలకపాటి హుస్సేన్, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ ఏ.రవీందర్ లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం బండ్లగూడకు చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ చిర్ర సత్యపాల్‌రెడ్డి సమీపాన పెట్రోల్ బంక్ నిర్మాణం చేపట్టేందుకు గాను బంక్ కోసం ఎన్ఓసీ కోసం జనగామ ఆర్అండ్‌బీ కార్యాలయానికి వెళ్లారు. నెల రోజుల క్రితం హెచ్‌పీ పెట్రోల్ బంక్ మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి తహసీల్దార్, ఆర్డీఓ, పంచాయతీ కార్యదర్శితోపాటు ఆర్అండ్‌బీ అధికారుల నుంచి ఎన్ఓసీ(నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం తహసీల్దార్, పంచాయతీలో ఫైల్ పెండింగ్‌లో ఉండగా, ఆర్అండ్‌బీ ఈఈ వద్దకు రాగా రూ.17వేలు డిమాండ్ చేశారు. బేర సారాలతో రూ.14 వేలకు ఒప్పందం కుదుర్చుకున్న బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈనేపథ్యంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ సత్యనారాయణరెడ్డి ఏసీబీ అధికారుల సలహా మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆర్అండ్‌బీ కార్యాలయంలో ఈఈ హుస్సేన్‌కు డబ్బులు తీసుకొచ్చినట్లు చెప్పాడు. తనకు (ఈఈ) రూ.12వేలు ఇవ్వాలని సూచించారు. వారికి డబ్బులు ఇవ్వగానే ఏసీబీ అధికారులు ఈఈ, ఏటీఓను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కెమికల్ పరీక్షలు నిర్వహించి, లంచం రూపంలో తీసుకున్న డబ్బులను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి, విచారణ జరిపిన అనంతరం, వరంగల్ ఏసీబీ కోర్టుకు తరలించారు.



ఏసీబీకి పట్టుబడ్డ ఈఈ, ఏటీఓ

నిర్లక్ష్యంగా మాట్లాడారు



ప్రభుత్వం నా భార్య పేరిట హెచ్‌పీ పెట్రోల్ బంక్ మంజూరు చేసింది. ఎన్ఓసీ కోసం వెళ్తే ఆర్అండ్‌బీ ఈఈ లంచం అడిగారు.. సర్.. నేను ఆర్మీ జవాన్‌గా పనిచేసిన.. కొంచెం చూడండి అంటూ బతిమిలాడిన. మా ప్రాసెస్ మాకుంటుంది. మేము పని చేస్తేనేమా... అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారు. ఎన్ఓసీ ఆలస్యం చేస్తారనే ఉద్దేశంతో రూ.14వేలకు ఒప్పుకుని ఏసీబీ అధికారులను ఆశ్రయించా. ఇలాంటి లీడర్లను సర్వీస్ నుంచి తొలగించాలి.

– చిర్ర సత్యపాల్‌రెడ్డి, ఆర్మీ జవాన్, బండ్లగూడ

పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పదోన్నతులు, బదిలీలు

వరంగల్ లీగల్: రాష్ట్ర వ్యాప్త బదిలీలో భాగంగా వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన గ్రేడ్–2 పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జె. భద్రాద్రి, ఎలికాల్ రాజేశ్వరరావు, మహబూబాబాద్‌కు చెందిన గ్రేడ్– 2 పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.సంతోష్‌కి గ్రేడ్ –1 పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా పదోన్నతి కల్పిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ వైజయంతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.భద్రాద్రి.. రంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు, ఏడో అదనపు జిల్లా కోర్టుకు బదిలీ అయ్యారు. వరంగల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎలికాల్ రాజేశ్వర్ రావు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టుకు బదిలీకాగా మహబూబాబాద్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.సంతోష్ వరంగల్ మూడో అదనపు జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు.



నేడు జాతీయ లోక్ అదాలత్

వరంగల్, హనుమకొండ జిల్లాల కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌కు ప్రధాన న్యాయమూర్తులు వీ.బీ.నిర్మల గీతాంబ, బి.అపర్ణదేవి శనివారం ఉదయం 10గంటలకు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్లు డాక్టర్ సత్యశారద, ప్రావీణ్య, సీపీ అంబర్ కిషోర్ ఝా, బార్ అసోసియేషన్ల అధ్యక్షులు తీగల జీవన్‌గౌడ్, రమేష్‌బాబు హాజరుకానున్నారు. కక్షిదారులు సకాలంలో హాజరై జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గంలో కేసుల పరిష్కారించుకోవాలని, న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీలు, వరంగల్ జిల్లాల కార్యదర్శులు సాయి కుమార్, ఉపేందర్ రావు శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు.

కాజీపేట మీదుగా దసరా ప్రత్యేక రైళ్లు

- అక్టోబర్ 2 నుంచి ప్రారంభం

కాజీపేట రూరల్: దసరా, దీపావళి పండుగల సమయంలో ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో కాజీపేట జంక్షన్ మీదుగా దక్షిణమధ్య రైల్వే అధికారులు తిరుపతి–సికింద్రాబాద్, సికింద్రాబాద్–తిరుపతి మధ్య 28 రైళ్ల సర్వీసులను ప్రవేశపెట్టి నడిపిస్తున్నట్లు శుక్రవారం రైల్వే అధికారులు తెలిపారు.

సికింద్రాబాద్–తిరుపతి మధ్య 14 రైళ్ల సర్వీసులు

అక్టోబర్ 2, 4, 9, 11, 16, 18, 23, 25, 30వ తేదీల్లో నవంబర్ 1, 6, 8, 13, 15వ తేదీల్లో సికింద్రాబాద్–తిరుపతి (07041) వెళ్లే స్పెషల్ ట్రైన్ ప్రతి బుధ, శుక్రవారాల్లో సికింద్రాబాద్‌లో 17:50 గంటలకు బయలుదేరి కాజీపేట జంక్షన్ 19:52 గంటలకు చేరుకుంటుంది.




తిరుపతి–సికింద్రాబాద్ మధ్య14 రైళ్ల సర్వీసులు

అక్టోబర్ 3, 5, 10, 12, 17, 19, 24, 26, 31వ తేదీల్లో, నవంబర్ 2, 7, 9, 14, 16వ తేదీల్లో తిరుపతి–సికింద్రాబాద్ (07042) వెళ్లే స్పెషల్ ట్రైన్ ప్రతి గురు, శనివారాల్లో తిరుపతిలో 09:40 గంటలకు బయలుదేరి మరునాడు కాజీపేట జంక్షన్‌కు 05:23 గంటలకు చేరుకుంటుంది. ఈ స్పెషల్ ట్రైన్స్ అప్ అండ్ డౌన్ రూట్‌లో జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, కొండపల్లి, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు జంక్షన్, రేణిగుంట స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించారు.

ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

- కానిస్టేబుల్ దుర్మరణం
- తొర్రూరు పోలీస్ స్టేషన్‌లో విధులు

మామునూరు: జాతీయ రహదారిపై నిలిచి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ బలంగా ఢీ కొట్టడంతో కానిస్టేబుల్ దుర్మరణం పాలయ్యాడు. ఈఘటన శుక్రవారం వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై మామునూరు గ్రామ శివారు చెరువు కట్ట సమీపాన జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం చింతనెక్కొండ గ్రామానికి చెందిన దప్పేట విజేందర్(32) తొర్రూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తొలుత నర్సంపేటలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో శ్రావణిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లల చదువు రీత్యా వరంగల్ శంభునిపేట ఏరియాలో ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. రోజూ తొర్రూర్ పోలీస్ స్టేషన్ వెళ్లి విధులు పూర్తి చేసి ఇంటికి వస్తుంటాడు. ఈక్రమంలో శుక్రవారం విధుల ముగించుకుని తొర్రూర్ నుంచి బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. ఈక్రమంలో మామునూరు శివారు చెరువు కట్ట సమీపానికి చేరుకోగానే పంచర్ కావడంతో రోడ్డు పై నిలిచి ఉంచిన ట్రాక్టర్‌ను బైక్‌తోసహా తప్పి బలంగా ఢీకొట్టింది. దీంతో కానిస్టేబుల్ దప్పేట విజేందర్ తీవ్రగాయాలై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా.. స్థానికులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. ఘటనా స్థలానికి మామునూరు ఎస్సై కృష్ణవేణి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని మెడికల్ ఎంజీఎం మార్చురీకి తరలించారు. విజేందర్ భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు శుక్రవారం సాయంత్రం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణవేణి తెలిపారు.



విజేందర్ (ఫైల్)

127కిలోల ఎండుగంజాయి స్వాధీనం

మరిపెడ: మరిపెడ మండలంలోని గాలివారిగూడెం స్టేజీ వద్ద కారులో తరలిస్తున్న 127కిలోల ఎండుగంజాయిని మరిపెడ పోలీసులు పట్టుకున్నట్లు ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ తెలిపారు. మరిపెడ పీఎస్‌లో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కుంట మండలం అటిగూడెంకి చెందిన రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న సోడీ నాగేశ్వరరావు కారులో గంజాయిని తరలిస్తుండగా మరిపెడ పోలీసులకు సమాచారం రావడంతో గాలివారి గూడెం స్టేజీ వద్ద పట్టుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. గంజాయి విలువ సుమారు రూ.31లక్షలు ఉంటుందని చెప్పారు. గంజాయితోపాటు కారును స్వాధీన పరుచుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్సైలు సతీశ్, సంతోశ్, కానిస్టేబుళ్లకు ఎస్పీ రివార్డులతో అభినందించారు. కార్యక్రమంలో సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సైలు, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



మరిపెడలో పట్టుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు

అనుమానమే పెనుభూతమై..

- భార్య గొంతు కోసి..
- కత్తితో దాడి చేసిన భర్త
- అడ్డుకున్న అత్తమామకు గాయాలు
- అల్లుడిపై ఫిర్యాదు చేసిన అత్తమామ



కవితకు ప్రథమ చికిత్స చేస్తున్న అంబులెన్స్ సిబ్బంది

వర్ధన్నపేట: ఊర్లో జులాయిగా తిరుగుతూ వ్యసనాలకు అలవాటుపడిన ఓ వ్యక్తి భార్యపై అనుమానంతో దాడికి పాల్పడ్డాడు. అడ్డువచ్చిన అత్తమామలపై సైతం దాడి చేయడంతో వారు గాయాలపాలయ్యారు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ శుక్రవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. వర్ధన్నపేటకు చెందిన బొజ్జ వీరలక్ష్మి, వీరస్వామి దంపతులకు నలుగురు కుమార్తెలు. మూడో కూతురు చొప్పరి కవితను 30 సంవత్సరాల క్రితం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం మల్లాపురం గ్రామానికి చెందిన రవికి ఇచ్చి వివాహం చేశారు. వీరి కుమారులు ఒకరు అండన్‌లో, ఒకరు బెంగళూరులో ఉద్యోగరీత్యా ఉంటున్నారు. రవి వ్యవసాయం చేసుకోకుండా గ్రామంలో జులాయిగా తిరుగుతూ చెడు వ్యసనాలకు బానిసగా మారాడు. ఈ క్రమంలో భార్య కవితను ఎప్పుడు అనుమానిస్తూ గొడవ పడుతూ హింసిస్తుండేవాడు. భర్త హింసను భరించలేక కవిత వర్ధన్నపేటలో తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. గురువారం వర్ధన్నపేటకు వచ్చిన రవి.. అత్తమామలు, భార్యకు.. తాను మారానని ఇక ఎప్పుడు ఏమీ అనను అని నమ్మించాడు. గురువారం రాత్రి అందరూ నిద్రకు ఉపక్రమించిన తర్వాత రవి తన వెంట తెచ్చుకున్న రాడ్‌తో నిద్రలో ఉన్న కవిత తలపై కొట్టాడు. దీంతో ఆమె తల్లిదండ్రులు దాడిని ఆపడానికి ప్రయత్నం చేయడంతోనే కత్తితో కవిత మెడను సైతం కోశాడు. ఈ ఘటనలో వృద్ధులైన అత్తామామలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరి అరుపులకు జరుగు పొరుగు వారు రావడంతో రవి అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు 108కు సమాచారం అందించగా అంబులెన్స్ పైలెట్ కుమార్, ఈఎంటీ మేరగాని శ్రీనివాస్ గాయపడిన కవితకు ప్రథమ చికిత్స చేసి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.. చికిత్స పొందుతుంది. కవిత తల్లి వీరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మంత్రాల నెపంతో వృద్ధుడి హత్య

- వివరాలు వెల్లడించిన తొర్రూరు సీఐ జగదీశ్



యాకయ్య మృతదేహం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ జగదీశ్

నెల్లికుదురు: మంత్రాలు చేసి.. తన కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాడనే మూఢ నమ్మకంతో ఓ వ్యక్తి.. వృద్ధున్ని తలపై కొట్టి చంపిన ఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్ననాగారంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తొర్రూర్ సీఐ జగదీశ్.. నెల్లికుదురు ఎస్సై చిర్ర రమేశ్‌బాబుతో కలిసి శుక్రవారం వివరాలు వెల్లడించారు. చిన్ననాగారం గ్రామానికి చెందిన మల్లం యాకయ్య (60) మంత్రాలు చేసి తన ఆరోగ్యం నాశనం చేశాడని, ప్రతిరోజూ ఆయనే కలలోకి వస్తున్నాడని మూఢ నమ్మకంతో అక్కడికి చేరుకున్న అదే గ్రామానికి చెందిన మల్లం రాజు.. యాకయ్యను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 6.30 గంటలకు గ్రామంలోని ముత్యాలమ్మ గుడి వద్ద మంచం పట్టి తో కాపుగాచి ఉన్న మల్లం రాజు.. అటుగా వెళ్తున్న మల్లం యాకయ్య తలపై కొట్టడంతో యాకయ్య అక్కడికి అక్కడే మృతి చెందాడు. యాకయ్య కుమారుడు మల్లం రమేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని రాజును అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు.

ముగిసిన పీహెచ్‌డీ అడ్మిషన్లు

- కేయూలో పాత నోటిఫికేషన్ మెరిట్ లిస్టు ప్రకారమే భర్తీ
- తొలుత కంటే ఇప్పుడే ఎక్కువ సీట్లు
- రెండు, మూడు జాబితాలు కలిపి 243 సీట్లలో అడ్మిషన్లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సోషల్ సైన్స్, సైన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఇంజనీరింగ్, ఫార్మసీ ఆర్ట్స్ విభాగాల్లో పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ ఎట్టకేలకు ఇటీవల ముగిసింది. గతంలో పీహెచ్‌డీ మొదట కేటగిరీలో మిగిలిన సీట్లను రెండో కేటగిరీలోకి మార్చు చేసి రెండోలిస్టుగా అడ్మిషన్లు కల్పించారు. 2021–2022లో పీహెచ్‌డీ నోటిఫికేషన్ ద్వారా ప్రవేశపరీక్ష నిర్వహించిన ఫలితాల అనంతరం ఇంటర్వ్యూలను నిర్వహించారు. మెరిట్ జాబితాలోనుంచి అభ్యర్థులకు అడ్మిషన్లు కల్పించాక కొందరుపేటూరిని విద్యార్థుల విధిత ఆరోపణలు చేస్తూ అప్పట్లో ఆందోళనలు చేసిన విషయం విదితమే. ఈనేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో మొదటి కేటగిరీలో మిగిలిన సీట్లతోపాటుగా గతంలో నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత నుంచి ఈఏడాది మార్చి 31వరకు వివిధ విభాగాల్లో ఏర్పడిన వేకెన్సీలను కూడా వెల్లడించి అడ్మిషన్లు కల్పించేందుకు యూనివర్సిటీ అధికారులు నిర్ణయించారు. ఇటీవల వివిధ విభాగాల డీన్లు సంబంధిత కమిటీతో కలిసి గతంలో పీహెచ్‌డీ రెండో కేటగిరీలో ప్రవేశపరీక్షలో మెరిట్ లిస్టు ఆధారంగా మూడోలిస్టుగా పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించారు. ఈ ప్రక్రియ అంతా గత కొన్నిరోజులపాటు కొనసాగింది. ఆర్ట్స్, సోషల్ సైన్స్ విభాగాల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు ఈనెల 19వరకు ఫీజు చెల్లించి అడ్మిషన్లు పొందే అవకాశం కల్పించగా సైన్స్ విభాగాల విద్యార్థులకు ఈనెల 23వరకు చివరి గడువు విధించి అడ్మిషన్లు కల్పించారు. వివిధ విభాగాల డీన్లు డీఆర్‌సీ సమావేశాలు నిర్వహించి పరిశోధక విద్యార్థులకు సూపర్‌వైజర్లను కేటాయించారు. సైన్స్ విభాగాల్లో కెమిస్ట్రీ, మ్యాథ్స్, స్టాటిస్టిక్స్ విభాగాల్లో సూపర్‌వైజర్లను కేటాయించే ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంది. వివిధ విభాగాలు పాత నోటిఫికేషన్ ద్వారానే మెరిట్ లిస్టుల ప్రకారం అడ్మిషన్లు కల్పించినట్లు సీట్లు వచ్చినవారి జాబితాలను కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారని తెలుస్తోంది. 2021–2022 నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు 210సీట్ల వేకెన్సీలు చూపి వాటిని భర్తీచేయగా అందులో 208 ప్రవేశాలు పొందారు. ఆందోళనల ఫలితంగా రెండోజాబితా, మూడో జాబితాల పేరున అప్పటికంటే ఎక్కువగా ఇప్పుడే 243 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించారు.



లైబ్రరీ సైన్స్‌లో అడ్మిషన్లకు అవకాశం

కేయూలోని లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో ఇక పీహెచ్‌డీ అడ్మిషన్లకు యూనివర్సిటీ అధికారులు అవకాశం కల్పించారు. ఈ లైబ్రరీ సైన్స్ విభాగాన్ని 2004–2005లో ప్రారంభించి ఎట్టకేలకు.. ఈ విభాగం అధిపతిగా ప్రస్తుతం డాక్టర్ రాధికారాణి వ్యవహరిస్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆమెకు నలుగురికి పీహెచ్‌డీ గైడ్‌షిప్‌కు అవకాశం కల్పించారు. సోషల్ సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లకు ఈనెల 25న సోషల్ సైన్స్ డీన్ మనోహర్ నోటిఫికేషన్ జారీచేశారు. అక్టోబర్ 10వ తేదీవరకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఎకానమిక్స్‌లో 3సీట్లు, లైబ్రరీ సైన్స్‌లో నాలుగు సీట్లు, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో 1, సోషియాలజీలో ఒక సీటు ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు మనోహర్ వెల్లడించారు.

ఫెలోషిప్స్ కలిగినవారికే పీహెచ్‌డీ అడ్మిషన్లు

కాకతీయ యూనివర్సిటీలో ఇక నుంచి ఏర్పడే పీహెచ్‌డీ అడ్మిషన్లకు ప్రవేశపరీక్ష ఉండదు. నేషనల్ ఫెలోషిప్స్, జేఆర్ఎఫ్ నెట్ తదితర ఫెలోషిప్స్ కలిగినవారికే పీహెచ్‌డీ అడ్మిషన్లు ఇవ్వనున్నారు. ఈమేరకు కొత్తగా యూజీసీ నిబంధనల ప్రకారమే అడ్మిషన్లు కల్పించేందుకు యూనివర్సిటీ నిర్ణయించింది. ముఖ్యంగా సంవత్సరానికి రెండుసార్లు మాత్రమే వేకెన్సీలను అనుగుణంగా ప్రతి ఏడాది రెండుసార్లు జూలై ఆ తర్వాత జనవరిలో మాత్రమే డీన్లు నోటిఫికేషన్లు ఇచ్చి నిబంధనల ప్రకారం అడ్మిషన్లు కల్పించాల్సి ఉంటుంది. ఇక నుంచి ఆచార్యులకు 57 ఏళ్ల వయస్సులోనే పీహెచ్‌డీ గైడ్‌షిప్‌ను కల్పిస్తారు. ఉద్యోగ విరమణకు మూడేళ్ల ముందునుంచే పీహెచ్‌డీ పరిశోధకులను కేటాయించరు.

తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రవేశపరీక్ష

హన్మకొండ కల్చరల్ : తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం వరంగల్ ప్రాంగణంలో ఎం.ఏ.తెలుగు కోర్సుకు దరఖాస్తు చేసుకున్నవారు ఈ నెల 28 శనివారం నుంచి వెబ్‌సైట్ www.pstucet.org ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భట్టు రమేశ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 3న ఉదయం వరంగల్ హంటర్‌రోడ్‌లోని జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు.